RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

WANTED

ప్రభాత సూర్యుడు

www.prabhathasuryudu.com

రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాదరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.

కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించాలెను. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

prabhathasuryududitor@gmail.com

https://youtube.com/@UstudioTV

94940 54338

RANGAREDDY, EDITION : 01, VOLUME :174 EDITOR: CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 08 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 174 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 08 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-



## 'ముదిరాజులను' అసెంబ్లీ దేవాలయంలోకి ప్రవేశం కల్పించిన...

# కాంగ్రెస్ పార్టీకి...రుణపడి ఉంటా..!


## పటాన్‌చెరువు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు

**ముదిరాజులను హక్కున చేర్చుకొని తెలంగాణ శాసనసభ దేవాలయంలోకి ప్రవేశం కల్పించిన కాంగ్రెస్ పార్టీని జీవితకాలంలో మర్చిపోనని పటాన్‌చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ పొంది కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నీలం మధు అన్నారు. మంగళవారం ఢిల్లీ నుంచి ఫోన్లో ప్రభాత సూర్యుడు ప్రత్యేక ప్రతినిధితో మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచి శాసనసభలో ప్రవేశించి సంపండ వర్గాల సమస్యలను చర్చించి ముదురాజులతోపాటు అన్ని వర్గాల కులాల సమస్యలను శాసనసభను వేదికగా చేసుకుని ఆయా వర్గాలకు న్యాయం చేయమని జాతీయ కాంగ్రెస్ పార్టీ నా భుజం తట్టి నాకు టికెట్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని 60 లక్షల మంది ఉన్న ముదిరాజు లను గౌరవించడమేనని అన్నారు. 100 సంవత్సరాల చరిత్ర గల జాతీయ కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ తనను గుర్తించి కాంగ్రెస్ పార్టీ గుర్తు అయిన చేతి గుర్తుపై పోటీ చేసే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని నీలం మధు అన్నారు.**

- మెట్రో రైలు మియాపూర్ నుంచి త్రిబుల్ ఐటీ వరకు పొడిగింపు
- ఎంఎంటీఎస్ రైలు జాతీయ రహదారి ఇక్రిశాట్ సర్వీసు రోడ్డు ప్రాంతంలో స్టేషన్ ఏర్పాటు
- పారిశ్రామిక ప్రాంతంలో యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు
- గత పది సంవత్సరాల కాలంలో జరిగిన భూకబ్జాలపై న్యాయ విచారణ
- బంగారుగడ్డ, ఆనంద్ నగర్, నర్రగూడెం, అయినవోలు, ఇంద్రేశం ప్లాట్ల ఓనర్లకు న్యాయం

**పటాన్‌చెరు - ప్రభాతసూర్యుడు**

ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ కర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఉత్తంకుమార్ రెడ్డి బట్టి విక్రమార్క గార్లను జీవితాంతం గుర్తు పెట్టుకుంటానని అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్టు ఇప్పించడానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కృషిచేసి సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 6 గ్యారంటీలను ప్రజలలో విస్తృతంగా తీసుకుపోయి అన్ని వర్గాల, అన్ని కులాల, మైనార్టీ సహోదరుల సహాయ సహకారాలతో అత్యధిక మెజారిటీతో గెలిచి ఏఐసీసీకి నా గెలుపును బహుమానంగా ఇస్తానని




నీలం మధును కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ కర్గే



రుద్రారం గణేష్ గడ్డ దేవాలయంలో నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న నీలం మధు


అన్నారు. మినీ భారత్ గా పేరున్న పటాన్ చెరువు నియోజకవర్గంలో వృత్తి రీత్యా, వ్యాపార రీత్యా, ఉద్యోగరీత్యా వివిధ రాష్ట్రాల నుండి ఈ ప్రాంతంలో స్థిర నివాసం నివాసం ఉంటున్న వారందరినీ కాపాడుకుంటానని అన్నారు. ముఖ్యంగా గుమ్మడిదల మండలం జిన్నారం మండలం పటాన్ చెరువు మండలం, బొల్లారం అమీన్ పూర్, రామచంద్రా పురం, తెల్లాపూర్, కొల్లూర్, ఉస్మాన్ నగర్, ఇస్నాపూర్, చిట్కుల్ ముత్తంగి, రుద్రారం, ఇంద్రేశం, అశోక్ నగర్, కర్దనూరు, పాశమైలారం, క్యాసారం, చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల తదితర ప్రాంతాలలోనే సొంత ఇల్లు లేని వారికి డబల్ బెడ్ రూములు ఇప్పించే ఏర్పాటు చేస్తానని అన్నారు. పటాన్ చెరువు నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతం లో సుమారు 6000 పరిశ్రమలు ఉన్నాయని ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని అన్నారు. మైనారిటీ యువత అభివృద్ధికి ప్రత్యేకమైన శ్రద్ధ పెడతానని అన్నారు. ముఖ్యంగా మెట్రో రైలును మియాపూర్ నుంచి త్రిబుల్ ఐటీ వరకు పొడిగిస్తానని తమ మేనిఫెస్టోలో ప్రత్యేకంగా పొంద పరుస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎంఎంటిసిని, జాతీయ రహదారి ఇక్రిసాట్ సర్వీసు రోడ్డులో రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని అన్నారు. జిన్నారం, బొల్లారం, పాశమైలారం,సుల్తాన్ పూర్, గుమ్మడిదల ప్రాంతాలలోని పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడుతానని అన్నారు. నూతనంగా ఏర్పాటు కాబోతున్న కొత్త ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అట్టి ప్రభుత్వ భూములలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించడానికి కృషి చేస్తానని అన్నారు. గడపగడపకు వెళ్లి ప్రతి ఇంటి తలుపు తట్టి, తనను దీవించి, ఆశీర్వదించి, కాంగ్రెస్ పార్టీ చేతు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రతి ఓటరు కలుస్తానని అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాష్ట్రంలోని ముదిరాజులను గుర్తించలేదని అన్నారు. 60 లక్షల మంది ముదురాజుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. అందుకే రాష్ట్రంలోని అధిక జనాభా ఉన్న బీసీ ముదిరాజ్ సంఘ కుటుంబ సభ్యులు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా గంపగుత్తగా చేతి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చే విధంగా ముదురాజు సహోదరులు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అమీన్పూర్ మండలం నర్రగూడెంలో 500 కుటుంబాల ఇండ్లను కూలగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ఇల్లు కోల్పోయిన వారికి పక్కా ఇల్లు ఏర్పాటు చేయడానికి తక్షణ చర్యలు తీసుకుంటానని అన్నారు పటాన్ చెరువు లోని బంగారుగడ్డ, ఆనంద్ నగర్, ఇంద్రేశం అయినవోలు, తదితర ప్లాట్ల ఓనర్లకు ఆయా ప్లాట్లు వారికే చెందేటట్లు చర్యలు తీసుకుంటానని అన్నారు. గత పది సంవత్సరాల నుంచి ప్రాంతంలో జరిగిన భూ కబ్జాలపై న్యాయ విచారణ చేపిస్తానని అన్నారు. కింది స్థాయి నుండి వచ్చిన తనను ఆదరించి, అత్యధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాల్సిందిగా ప్రతి ఒక్కరిని పేరుపేరునా వేడుకున్నారు.

## తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు




**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు:** తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌కు స్థలాన్ని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రూ.3.70 కోట్ల రూపాయల స్థలాన్ని ప్రభుత్వం జీవో విడుదల చేసి ఆర్బిట్రేషన్‌కు ఉచితంగా ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయవాది కోటి రఘునాథ్ రావు పిటిషన్ దాఖలు చేశారు. రాయదుర్గ, శేర్లింగంపల్లి మండల పరిధిలో ఆర్బిట్రేషన్‌కు మూడెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తూ జీవో జారీ చేసింది. అయితే ఎలాంటి డబ్బులు తీసుకోకుండా ఆర్బిట్రేషన్‌కు స్థలాన్ని ఇవ్వడంపై పిటిషనర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్బిట్రేషన్‌కు స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 126పై స్టే ఇవ్వాలని కోర్టును పిటిషన్‌ర్లు కోరారు. పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. తెలంగాణ ప్రభుత్వానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 21కి హైకోర్టు వాయిదా వేసింది.

## బీఆర్ఎస్ తుది జాబితా..





**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ పార్టీ ఆగస్టులోనే అభ్యర్థులను ప్రకటించింది. కొన్ని స్థానాలను అప్పుడు ప్రకటించకుండా వారి వీలును బట్టి ప్రకటించుకుంటూ వస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే కొంత మంది అభ్యర్థులకు బీఫాం కూడా ఆ పార్టీ అందించింది. తొలుత ప్రకటించిన వారిలో కూడా కొన్ని మార్పులు చేస్తు వచ్చింది ఆ పార్టీ. తాజాగా మిగిలిన 9 స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ మేరకు ఆ తొమ్మిది మందికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఫామ్స్ అందజేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ వారికి బీఫామ్స్ అందించి అభినందించారు. అలంపూర్‌కు గతంలో ప్రకటించిన అబ్రహంకు కాకుండా విజేయుడికి బీ ఫామ్ అందించారు. గోషామహల్ అభ్యర్థిగా నంద కిషోర్ వ్యాస్, నాంపల్లి అభ్యర్థి అనంద్ కుమార్ గౌడ్‌ను ఖరారు చేశారు. వీరికి బీఫాం అందించడంతో మొత్తం 119 మందికి బీ ఫాం అందించడం పూర్తి అయింది. గతంలోనే 110 మందికి సీఎం కేసీఆర్ బీ ఫాంలు అందించారు. తాజాగా సీఎం కేసీఆర్ ఆదేశాలతో 9 మందికి కేటీఆర్ బీ ఫామ్స్ అందించారు.

**9 స్థానాలు ఇవే..**

1. చాంద్రాయణ గుట్ట -ఎం.సీతారాం రెడ్డి
2. యాకత్ పురా -సామా సుందర్ రెడ్డి
3. బహుదూర్‌పుర-ఇనాయత్ అలీ బక్రీ
4. మలక్ పేట- తీగల అజిత్ రెడ్డి
5. కార్వాన్ -అయిందాల కృష్ణ
6. చార్మినార్-సలావుద్దీన్ లోడి
7. నాంపల్లి - సీహెచ్ ఆనంద్ కుమార్ గౌడ
8. గోషామహాల్ -నంద కిషోర్ వ్యాస్
9. అలంపూర్ -విజేయుడు

## చంద్రబాబు కంటికి కాటరాక్ట్ ఆపరేషన్ పూర్తి



**హైదరాబాద్:** ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్స పూర్తయింది. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు ఆయనకు విజయవంతంగా కాటరాక్ట్ ఆపరేషన్‌ను నిర్వహించారు. చంద్రబాబుకు 45 నిమిషాల్లో కాటరాక్ట్ ఆపరేషన్‌ను వైద్యులు పూర్తి చేశారు. ఆపరేషన్ ముగిసిన వెంటనే ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి బయలుదేరారు. మరో వారం రోజుల పాటు చంద్రబాబు విశ్రాంతి తీసుకోనున్నారు. మరోవైపు చంద్రబాబును చూసేందుకు పెద్ద సంఖ్యలో టీడీపీ అభిమానులు ఆసుపత్రికి వచ్చారు. చంద్రబాబు కంటి ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల టీడీపీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన చంద్రబాబు 50 రోజులకు పైగా రాజమండ్రి జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో కంటికి ఆపరేషన్ నేపథ్యంలో షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో గెలిచేది బీజేపీయే..!

- ఢిల్లీ లిక్కర్ కేసులో విచారణ జరిపి తీరతాం
- తెలంగాణ ఉద్యమంలో బీసీలదే కీలక పాత్ర
- మేమే గెలుస్తాం.. బీసీని సీఎం చేస్తాం
- బీఆర్ఎస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం



**బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనంటూ కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తుంటే.. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా కేసీఆర్ కుటుంబంపైనే గురి పెట్టారు! ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ నేతలకు లింకులు ఉన్నాయని, విచారణ జరుపుతున్న దర్యాప్తు సంస్థలను దూషిస్తున్నారని, అయినా, విచారణ జరిపి తీరతామని స్పష్టం చేశారు. అదే సమయంలో, నిరుద్యోగ భృతి నుంచి టీఎస్‌పీఎస్సీ లీకుల వరకూ బీఆర్ఎస్ వైఫల్యాలపై ధ్వజమెత్తారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన బీసీ ఆత్మ గౌరవ సభలో మాట్లాడిన ఆయన.. బీసీలను ఆకర్షించేందుకు ప్రయత్నించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ బీసీల పాత్ర కీలకమని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే.. బీసీ నాయకుడే ముఖ్యమంత్రి అని ప్రకటించారు. బీసీల సంక్షేమానికి ఏటా వెయ్యి కోట్లు ఇస్తామని వెల్లడించారు. కేంద్రంలో కూడా బీసీలకు పెద్దపీట వేశామంటూ తాము చేసిన కార్యక్రమాలను వివరించారు.**

**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు:** తెలంగాణలో గెలిచేది బీజేపీయేనని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంపూర్ణ మెజారిటీ సాధిస్తామని, బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పారు. ప్రజల్ని దోచుకొని, దాచుకున్న సొమ్మును తిరిగి ఇప్పిస్తానని, దీనికి తనదే గ్యారెంటీ అని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలని.. కాంగ్రెస్ కుటుంబ పార్టీ కాగా, బీఆర్ఎస్ అవినీతి పునాదులపై నడుస్తోందని అన్నారు. 'ఢిల్లీ మద్యం కుంభకోణంతో బీఆర్ఎసకు లింకులున్నాయి. దీనిపై విచారణకు ఉపక్రమిస్తే.. కేంద్ర దర్యాప్తు సంస్థలను దూషించారు. కానీ, బీఆర్ఎస్ అవినీతికి వ్యతిరేకంగా విచారణ జరిపి తీరతాం' అని ప్రధాని స్పష్టం చేశారు. మంగళవారం ఎల్బీ స్టేడియంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బీసీ ఆత్మగౌరవ సభ'లో మోదీ మాట్లాడారు. బీఆర్ఎసకు రెండు టీమ్‌లు ఉన్నాయన్నారు. పరదా వెనక సీ టీమ్ కూడా ఉందని, అదే కాంగ్రెస్ అని చెప్పారు. ఆ పార్టీలతో కుటుంబసభ్యులు, బంధువులకే మేలు జరుగుతుందని.. కుటుంబ పార్టీలు బీసీలను ముఖ్యమంత్రి చేయవని స్పష్టం చేశారు. తెలంగాణలో అభివృద్ధి, బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరోధక ప్రభుత్వం ఉందని.. ఈ నెల 30న దాన్ని తొలగించి, కమల వికాసం తేవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో మార్పుకు సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. బీజేపీపై నమ్మకం పెరిగిందని చెప్పారు. వారసత్వ రాజకీయ పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీలను ముందుకెళ్లనివ్వవని ఆరోపించారు. తాము ఓబీసీ వర్గాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, కేంద్ర మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలు ఉన్నారని తెలిపారు. 'తెలంగాణలో బీసీల సంక్షేమం కోసం ఏటా రూ.1000 కోట్లు ఇస్తామన్నారు.. ఇచ్చారా..?' అని సభికులను ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎసలు బీసీ వర్గాలకు మేలు చేయబోవని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించిందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి, వైద్యవిద్యలో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించామని వెల్లడించారు. బీసీ కుల వృత్తుల ఆర్థిక సాధికారత కోసం 13,000 కోట్లతో పీఎం విశ్వకర్మ యోజన అమలు చేస్తున్నామని తెలిపారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు అహంకార సీఎంకు గట్టి జవాబు ఇచ్చారని మోదీ.. కేసీఆర్‌కు చురకలంటించారు.

అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ పెద్దపెద్ద హామీలు ఇచ్చి, ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణలోని నిరుద్యోగులను తొమ్మిదేళ్లుగా మోసం చేస్తున్నారన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. ఇలాంటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని 'అధికారం నుంచి తప్పించాలా? వద్దా?.. చెప్పండి తెలంగాణ ప్రజలారా' అని మోదీ అడిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీని అమలు చేయలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లలో పేదలకు 4 కోట్ల ఇళ్లను కట్టించి ఇచ్చిందని.. తెలంగాణలోనూ 2.50 లక్షల ఇళ్లు ఇచ్చామని మోదీ చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు రైతులను కూడా మోసం చేసిందని, రూ.లక్ష రుణమాఫీ హామీని అమలు చేయలేదని విమర్శించారు. పీఎం కిసాన్ పథకం కింద తమ ప్రభుత్వం 35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.9000 కోట్లను జమ చేసిందని చెప్పారు.

**నాకు ఆకలి విలువ తెలుసు..**

తానూ పేదరికం నుంచి వచ్చిన వాణ్నేనని, తనకు ఆకలి విలువ తెలుసని మోదీ అన్నారు. పేద వర్గాల పిల్లలను ఆకలి నుంచి బయట పడేయడానికే 'పీఎం గరీబ్ కల్యాణ్ యోజన'ను అమలు చేశామని తెలిపారు.

80 కోట్ల మంది పేదలకు ఉచితంగా బియ్యం ఇస్తున్నామని, డిసెంబరుతో ఈ పథకం గడువు ముగియనుందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో పేద వర్గాలను వదిలేయబోమని, ఐదేళ్లు ఈ పథకాన్ని పొడిగించాలని నిర్ణయించామని మోదీ తెలిపారు. దీనికి సెల్‌ఫోన్ ఫ్లాష్ లైట్ వేసి మద్దతునివ్వాలని కోరగా.. సభకు హాజరైన వారంతా ఫ్లాష్ వేశారు. మోదీ ప్రసంగం ప్రారంభించే ముందు తెలుగులో సమ్మక్క-సారలమ్మ, యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని స్మరించుకొని, తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మధ్యలో కూడా పలుమార్లు ప్రధాని తన ప్రసంగానికి తానే తెలుగులో అనువాదం చేసి, ప్రజలకు వివరించారు.

**తెలంగాణ ఉద్యమంలో బీసీల పాత్రే కీలకం..**

తెలంగాణ ఉద్యమంలో బీసీల పాత్ర కీలకమని మోదీ చెప్పారు. ఉద్యమంలో అందరి కంటే ముందున్నది వారేనన్నారు. తెలంగాణ కోసం ఎంతో మంది ఆత్మార్పణ చేసుకున్నారని..

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొలువుదీరిన సర్కారు బీసీ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ గడ్డతో, ఎల్బీ స్టేడియంతో తనకు అవినాభావ సంబంధం ఉందని మోదీ అన్నారు. 2013లో ప్రధాని అభ్యర్థిగా తనకు మద్దతు పలికారని, దేశ రాజకీయాల్లో చారిత్రక సభ ఈ మైదానంలోనే జరిగిందని గుర్తుచేశారు. ఆ సభలోనే తనను ప్రధానమంత్రి అభ్యర్థిగా ఇక్కడి ప్రజలు సమర్థించారని తెలిపారు. ఇప్పుడు బీజేపీ తొలి బీసీ ముఖ్యమంత్రి కూడా ఇదే మైదానం నుంచి అవుతారని చెప్పారు.

**బీజేపీతోనే బడుగులకు న్యాయం**

దేశంలో బడుగు వర్గాలకు న్యాయం చేసేది బీజేపీ మాత్రమేనని మోదీ చెప్పారు. వాజ్‌పేయి అధికారంలో ఉండగా.. కలాంను రాష్ట్రపతి చేశామని, 1996లో లోక్‌సభ స్పీకర్‌గా పీఏ సంగ్మాకు మద్దతు ఇచ్చామని తెలిపారు. లోక్‌సభ తొలి దళిత స్పీకర్‌గా బాలయోగిని చేశామన్నారు.

ఎస్సీ వర్గానికి చెందిన కోవింద్‌ను రాష్ట్రపతిని చేశామని, ఆదివాసీ వర్గానికి చెందిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేశామని తెలిపారు. ఓబీసీ అయిన తనను బీజేపీ ప్రధానమంత్రిని చేసిందని చెప్పారు.

# రేవంత్ సీఎం అయితే రాష్ట్రాన్ని అమ్మేస్తాడు



**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు:** ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్లిన దొంగ రేవంత్‌రెడ్డి అని బీఆర్ఆర్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. తాజా ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ టికెట్లు కూడా అమ్ముకున్నాడని ఆరోపించారు. అతనికి ముఖ్యమంత్రి పదవి కట్టబెడితే ఏకంగా తెలంగాణను అమ్ముకుంటాడని అన్నారు. మంగళవారం వివిధ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నేతలు బీఆర్ఎసలో చేరిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రేవంత్ కాంగ్రెసలోకి వచ్చాకే ఆ పార్టీకి దుర్భర పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కోట్లు పెట్టి పీసీసీ అధ్యక్ష పదవిని కొనుక్కున్న రేవంత్‌కు అధికారమిస్తే రాష్ట్రంలోని భూములన్నింటినీ ప్లాట్లు వేసి అమ్ముకుంటాడన్నారు. ముఖ్యమంత్రి కావాలనుకుంటున్న రేవంత్ తెలివేంటో, కాంగ్రెస్ పార్టీ తీరేంటో ప్రజలు తెలుసుకోవాలని కోరారు. జాతీయ స్థాయిలో అందరికీ భిన్నంగా గొంతు వినిపిస్తున్న కేసీఆర్‌తో తమకు ఎప్పటికైనా ఇబ్బందేననే ఉద్దేశంతో.. కాంగ్రెస్, బీజేపీలు ఆయన గొంతు నొక్కేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెసలకు చేతగాని, చావలేని నాయకులు ఉన్నందువల్లే బయటి రాష్ట్రాల నుంచి ప్రచారానికి నాయకులను తెచ్చుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రెండు పార్టీల ముఖ్య నేతలంతా గుంపులు గుంపులుగా వచ్చి రాష్ట్రం మీద పడుతుంటే బీఆర్ఎస్ తరఫున కేసీఆర్ సింహంలా సింగిల్‌గా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. సొంత రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు చేయని కర్ణాటక కాంగ్రెస్ నేతలు ఇక్కడకొచ్చి వాగ్దానాలు చేస్తే జనం నమ్మరన్నారు. కర్ణాటకలో ఐదు గంటలు కరెంటు మాత్రమే ఇస్తున్నామని డీకే శివకుమార్ చెబుతుంటే తెలంగాణ జనం నవ్వుకుంటున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మూడు గంటల కరెంటిస్తే చాలంటున్న రేవంత్‌ను జనం నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వలసల జిల్లా పాలమూరు నుంచి ప్రాజెక్టులు నిర్మించి సాగునీటి వనరులు పెంచిన కారణంగా వలసలు వెళ్లిన వారంతా తిరిగి వస్తున్నారని చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. 55 ఏళు అధికారంలో ఉన్న కాంగ్రెస్ సాగునీరు, తాగునీరు ఎందుకు అందించలేక పోయిందని కేటీఆర్ ప్రశ్నించారు.


**రెండు పుస్తకాల ఆవిష్కరణ**

పూర్వం కవులు శతకపద్యాలు రాసినట్టు, చిత్రగుప్తుడు మనుషుల పాపాల చిట్టా రాసినట్టు.. ఇప్పుడు కాంగ్రెస్ పాపాల గురించి శతకాలు, గ్రంథాలు రాయాల్సి వస్తోందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం రూపొందించిన తెలంగాణలో కాంగ్రెస్ పాపాల శతకం, స్కాంగ్రెస్ పుస్తకాలను తెలంగాణ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అత్యధిక కాలం పాలించిన పార్టీ పాపాల చిట్టాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, ముషీరాబాద్ బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నేత ఎడ్ల హరిబాబుయాదవ్ తదితరులతో కేటీఆర్ చర్చలు జరిపారు. ముఠా గోపాల్ గెలుపు కోసం అందరూ పనిచేయాలని, పార్టీ గెలిచాక సముచిత స్థానాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**అలంపూర్ అభ్యర్థి మార్పు గోషామహల్, నాంపల్లి అభ్యర్థుల ఖరారు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం 9 మంది అభ్యర్థులకు బీ ఫామ్‌లు అందజేశారు. అలంపూర్ స్థానంలో అబ్రహంకు కాకుండా విజయుడుకు అవకాశం ఇచ్చారు. నాంపల్లి స్థానానికి ఆనంద్ కుమార్‌గౌడ్, గోషామహల్‌కు నంద కిషోర్ వ్యాస్‌ను ఖరారు చేసి, బీ ఫామ్‌లు ఇచ్చారు. చాంద్రాయణగుట్టలో ఎం.సీతారాంరెడ్డికి, యాకుత్ పురాలో సామ సుందర్‌రెడ్డికి, బహదూర్‌పురాలో ఇనాయత్ అలీబాక్రికి, మలక్‌పేట్‌లో తీగల అజిత్‌రెడ్డికి, కార్వాన్‌లో అయిందాల కృష్ణకు, చార్మినార్ లో సలావుద్దీన్‌ను బరిలోకి దింపాలని నిర్ణయించి, బీఫామ్‌లను అందజేశారు. గోషామహల్ టికెట్ ఆశించిన ఆశిషకుమార్‌ను బుజ్జగించిన కేటీఆర్.. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని కోరారు.

## 'ప్రళయ్' క్షిపణి ప్రయోగం విజయవంతం



బాలాసోర్- ప్రభాతసూర్యుడు: ఉపరితలం నుండి ఉపరితలానికి దూసుకువెళ్లే స్వల్ప శ్రేణి బాలిస్టిక్ మిసైల్ 'ప్రళయ్' ప్రయోగం విజయవంతమైంది. ఒడిశా తీరంలోని అబ్దుల్ కలామ్ దీవి నుండి మంగళవారం ఉదయం 9.50 గంటలకు ఈ క్షిపణిని ప్రయోగించినట్లు రక్షణశాఖ అధికారులు తెలిపారు. ఈ క్షిపణిని డిఫెన్స్ రీసెర్చ్ మరియు డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) అభివృద్ధి చేసినట్లు తెలిపారు. 350 నుండి 500 కిలోమీటర్ల వరకు ఉన్న లక్ష్యాలను ప్రళయ్ ఛేధించగలదని, దీని పేలోడ్ కెపాసిటీ 500 నుంచి 1000 కిలోలు ఉంటుందని ఓ అధికారి వెల్లడించారు. నియంత్రణ రేఖ(ఎల్‌ఒసి), వాస్తవాదీన రేఖ (ఎల్‌ఎసి) వద్ద ఈ క్షిపణిని మోహరించనున్నట్లు ఆయన తెలిపారు.

## టీఎస్ సెట్ ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణ



హైదరాబాద్- ప్రభాతసూర్యుడు: తెలంగాణలో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించిన టీఎస్ సెట్-2023 పరీక్ష ప్రశ్నపత్రం ప్రాథమిక కీ ఇప్పటికే విడుదలైన విషయం తెలిసిందే. అయితే, ఈ కీపై అభ్యంతరాల స్వీకరణ మొదలైంది. నవంబర్ 7న మధ్యాహ్నం 1గంట నుంచి ఆన్‌లైన్‌లో అభ్యంతరాల స్వీకరణకు సంబంధించిన లింక్ అందుబాటులోకి వచ్చింది. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ http://telanganaset.org  ఈ లింక్‌పై క్లిక్ చేసి.. తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీతో లాగిన్ కావాల్సి ఉంటుంది. అయితే, తగిన సాక్ష్యాలు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యంతరాలు తెలిపేందుకు వీలుగా ఈ లింక్ గురువారం (నవంబర్ 9) మధ్యాహ్నం 1గంట వరకు అందుబాటులో ఉండనుంది.

## ఏదో ఒకరోజు నేను సీఎం అవుతా..!

**- నల్లగొండ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

హైదరాబాద్- ప్రభాతసూర్యుడు: ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి ముఖ్యమంత్రి అయ్యే రోజు వస్తుందని, ఏదో ఒకరోజు తాను సీఎంను అవుతానని భువనగిరి ఎంపీ, నల్లగొండ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రోడ్డు షోలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ మాయమాటలు చెప్పి గత ఎన్నికల్లో విజయం సాధించిందన్నారు. తెలంగాణ ఇచ్చిన లక్ష్యం నెరవేరలేదన్నారు. రైతులు, చేనేత కార్మికులు, విద్యార్థుల ఆత్మహత్యల కోసం తెలంగాణను తెచ్చుకోలేదన్నారు. ఉద్యోగాల భర్తీలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. పోలింగ్ చివరి రోజున రైతుబంధు డబ్బులు వేస్తారని, ఎవరూ మోసపోవద్దని హితవు పలికారు. నల్లగొండలో ప్రస్తుతం కనిపిస్తోన్న అభివద్ధి తాను చేసిందే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తాము ఇచ్చిన ఆరు గ్యారంటీ లను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ కట్టిన నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు డెబ్బై ఏళ్లయినా చెక్కు చెదరలేదని, కానీ కేసీఆర్ కట్టిన కాళేశ్వరం బ్యారేజీ అప్పుడే బీటలు వారిందన్నారు. డిసెంబర్ 9 మన లక్కీ నెంబర్ అని, ఆ రోజు సోనియా పుట్టిన రోజు అని, ఆ రోజే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు.

## బీఆర్ఎస్ అలంపూర్ అభ్యర్థి మార్పు

**- అబ్రహంకు నిరాశ- విజయుడుకు టిక్కెట్**

**- మొత్తం 119 స్థానాలకు బీ-ఫామ్‌ల అందజేత**

హైదరాబాద్- ప్రభాతసూర్యుడు: నామినేషన్ల ఘట్టం ఊపందుకున్న వేళ అధికార బీఆర్‌ఎస్ ఇంతకుముందు ఆలంపూర్ అభ్యర్థిగా ప్రకటించిన అబ్రహాంకు షాక్‌నిచ్చింది. ఆయన స్థానంలో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి అనుయాయుడు విజయుడుకు ఆ స్థానాన్ని కేటాయించింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు మంగళవారం బీ-ఫామ్‌ను అందజేశారు. దీంతోపాటు చాంద్రాయణగుట్ట నుంచి ఎం.సీతారాం రెడ్డికి, యాకుత్‌పూరా నుంచి సామా సుందర్‌రెడ్డికి, బహదూర్‌పూరా నుంచి ఇనాయత్ అలీబాక్రీకి, మలక్‌పేట నుంచి తీగల అజిత్‌రెడ్డికి, కార్వాన్ నుంచి అయిందాల కృష్ణకు, చార్మినార్ నుంచి సలావుద్దీన్ లోడీకి, నాంపల్లి నుంచి సీహెచ్ ఆనందకుమార్ గౌడ్‌కు, గోషామహల్ నుంచి నందకిషోర్ వ్యాస్‌కు టిక్కెట్లను ఖరారు చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేయగా కేటీఆర్ బీ-ఫారాలను అందజేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ మొత్తం 119 స్థానాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఖరారు చేసి బీ- ఫారాలను అంద జేసింది. పంపిణీ కింద

### తెలంగాణకు రూ. 1,533.64 కోట్లు

న్యూఢిల్లీ : పన్నుల్లో పంపిణీ వాటా కింద నవంబర్ నెలకు గాను తెలంగాణ రాష్ట్రానికి రూ.1,533. 64 కోట్లను కేంద్రం విడుదల చేసింది. సాధారంగా ప్రతి నెల 10న ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. అయితే ఈసారి మూడు రోజుల ముందుగానే పన్నుల్లో పంపిణీ వాటాలను రాష్ట్రాలకు విడుదల చేసినట్లు వెల్లడించింది. పండుగ సమయంలో ముందస్తు నిధుల విడుదల రాష్ట్ర ప్రభుత్వాలకు మేలు చేస్తోందని అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

# కాంగ్రెస్ పార్టీ గెలిస్తే దళారుల రాజ్యం

**- పెద్దపల్లి, మంథని, మందమర్రి సభల్లో కేసీఆర్**



పెద్దపల్లి- ప్రభాతసూర్యుడు: ప్రధాని నరేంద్ర మోదీకి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే పిచ్చి పట్టుకుందని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆరోపించారు. అందులో భాగంగానే తెలంగాణలోని సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. గతంలో వంద శాతం తెలంగాణ కంపెనీగా ఉన్న సింగరేణిలో ఇతరులెవరికీ వాటా ఉండేది కాదని, అప్పటి చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం వద్ద అప్పులు చేసి తీర్చలేని స్థితిలో 49 శాతం వాటా అప్పగించిందన్నారు. 2014లో రూ.419 కోట్లుగా ఉన్న సింగరేణి లాభాలను రూ.2,184 కోట్లకు చేర్చిన ఘనత బీఆర్ఎసది అని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో కార్మికులకు 18 శాతం లాభాల వాటా చెల్లిస్తే బీఆర్‌ఎస్ పాలనలో దానిని 32 శాతానికి పెంచామన్నారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న 45 వేల మందికి తమ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. 19,400 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని మంథని, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా మందమర్రిలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు. ఓటు వజ్రాయుధమని, ఐదేళ్ల రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. ప్రతి పార్టీ నుంచి ఒకరు నిలబడతారని, ఏ పార్టీ చరిత్ర ఎలాంటిది? నడవడిక ఏమిటి? అధికారం ఇస్తే ఏం చేస్తారు? గతంలో ఏ చేశారు?.. ఇలా అన్నీ ఆలోచన చేయాలని, ప్రజాస్వామ్య పరిణతిని ప్రదర్శించాలని సూచించారు. చిన్నాన్న చెప్పిండనో, బామ్మర్ది చెప్పిండనో ఓటు వేయవద్దని కోరారు. బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ సాధన కోసం, ప్రజల బాగు కోసమని స్పష్టం చేశారు. 1956 వరకు స్వతంత్ర రాష్ట్రంగా ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపి అన్యాయం చేసిన చరిత్ర కాంగ్రెసదని ఆరోపించారు. ఇందుకోసం పట్టపగలు ఏడుగురు విద్యార్థులను కాల్చి చంపిందని ధ్వజమెత్తారు. "రాహుల్‌గాంధీకిఎద్దు ఎరికేనా.. ఎవుసం ఎరికేనా.. ఆయన కూడా ధరణిని బంగాళాఖాతంలో ఏస్తామని అంటాండు.. కేసీఆర్ రైతుబంధు పెట్టి ప్రజలు కట్టిన ట్యాక్సుల సొమ్మును దుబారా చేస్తుండు అని ఒకాయన అంటడు, 24 గంటల కరెంట్ వద్దు.. 3 గంటల కరెంటే చాలని ఇంకొకాయన చెబుతడు... ఇక మళ్లీ దళారుల రాజ్యమే కావాల్నా, మళ్లీ మొదటికే రావాల్నా.. కాంగ్రెస్ పార్టీ భుజాన గొడ్డలి పెట్టుకుని రెడీగా ఉంది.. ఆగమాగం కావద్దు.. ఏ పార్టీ మంచిదో.. ఏ పార్టీ చెడ్డదో.. ఆలోచించి ఓటు వేయాలి" అని సూచించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని మత కలహాలు, పంచాయితీలు లేవని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో పెట్టని పథకాలనూ అమలు చేశామన్నారు. "ధరణిని తీసేస్తామని కాంగ్రెస్ నాయకులు పక్కాగా చెబుతున్నారు. ధరణి లేకుంటే రైతుబంధు, రైతుబీమా, వడ్ల పైసలు ఎట్లా పడతాయి? హైదరాబాద్‌లో డబ్బులు వేయంగానే రైతుల ఫోన్లు టింగ్.. టింగ్‌మని మోగుతున్నాయి. ఇది సాధ్యమైంది ధరణితోనే. అదే లేకుంటే ఎల్లయ్యది మల్లయ్యకు, మల్లయ్యది పుల్లయ్యకు రాసి జుట్లు ముడేసి కొట్లాటలు పెడతరు. రైతులు మళ్లీ తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వస్తుంది. కాంగ్రెస్ వస్తే మళ్లీ దళారులు రాజ్యమేలుతారు. పైరవీలతోనే పనులవుతాయి. కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇప్పుడైతే 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయి అదేరోజు మ్యుటేషన్ అవుతున్నది. ఈ వసతి పోతే మళ్లీ అరాచకమే"అని అన్నారు.

### దశలవారీగా పింఛన్ పెంపు

బీఆర్‌ఎస్ మరో సారి అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న ఆసరా పింఛన్‌ను దశలవారీగా రూ.5,016కు పెంచుతామని కేసీఆర్ హామీ ఇచ్చారు. పదేళ్ల పాలనలో 13లక్షల మందికి కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేశామని తెలిపారు. ఒక్క సారి అధికారమిస్తే అన్నీ చేస్తామని చెబుతున్న కాంగ్రెస్.. ఆ పార్టీ అధికారంలో ఉన్న ఛత్తీసగఢ్, హిమచల్‌ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దళితబంధు పథకం దేశంలోనే పొలికేక వంటిదని కేసీఆర్ అభివర్ణించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతీ దళిత కుటుంబానికి పథకం వర్తింపజేసేలా బీఆర్‌ఎస్ పని చేస్తుందన్నారు. 50 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్.. దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుందే గానీ, వారికి చేసిన మేలేమీ లేదన్నారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టామని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ బాస్ ఢిల్లీలో ఉండడని, ప్రజల్లోనే ఉంటాడని స్పష్టంచేశారు. మంథనిలో బీసీ బిడ్డ అయిన పుట్ట మధును గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు మంజూ రు చేస్తానని హామీఇచ్చారు. పెద్దపల్లిలో సర్వేలన్నీ మనోహర్‌రెడ్డికి అనుకూలంగా ఉన్నాయని,ఆయన్ను లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# ప్రపంచ ప్రతిష్టాత్మక అవార్డు గెలుపొందిన కేరళ టూరిజం



హైదరాబాద్- ప్రభాతసూర్యుడు: కేరళ రాష్ట్రంలోని పర్యాటక శాఖకు ప్రత్యేకస్థానం ఉంది. సమష్టిగా పనిచేసి ఏకంగా ప్రపంచ అవార్డులు సొంతం చేసుకుంటుంది. అక్కడి ప్రజలు, ప్రభుత్వ విధానంలో మరింత స్ఫూర్తి నింపుతుంది. ఓ జీవన గమనంలో ఉండేంతటి ఆశయాలూ, సవాళ్లూ, అన్నింటికన్నా మానవీయ కోణాలూ, స్థానిక ప్రజల ఆర్థిక ప్రమాణాలు..వేలాది మంది సమష్టి కృషితో సాధించుకున్న కేరళ పర్యాటకు శాఖ ఆచరణీయం అవుతుంది. ఫలితంగా..రాష్ట్ర బాధ్యతాయుత టూరిజం మిషన్ ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికిగాను కేరళ ప్రతిష్టాత్మకమైన 'గ్లోబల్ రెస్పాన్సిబుల్ టూరిజం అవార్డు'ని కైవసం చేసుకుంది. తాజాగా గెలుపొందిన గ్లోబల్ రెస్పాన్సిబుల్ టూరిజం అవార్డును రెస్పాన్సిబుల్ టూరిజం పార్టనర్‌షిప్, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ టూరిజం (ఐసీఆర్‌టీ), బెస్ట్ ఫర్ లోకల్ సోర్సింగ్, ఫుడ్ అండ్ క్రాఫ్ట్ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేశారు. మహిళల నేతృత్వంలోని చిన్న, మధ్య తరహా సంస్థలను పర్యాటక కార్యకలాపాలకు అనుసంధానించారు. స్వదేశీ ఉత్పత్తులనే మార్కెటింగ్ చేశారు. అందుకు రాష్ట్ర మిషన్ సమ్మిళిత పర్యాటక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. దాంతో అత్యంత విలువైన అవార్డును సొంతం చేసుకున్నారు. కేరళ టూరిజం ద్వారా రాష్ట్రానికి చేకూరే ప్రయోజనాలు కింది విధంగా ఉన్నాయి.

**2019లో ఆదాయం: రూ.45,010.69 కోట్లు(కరోనా ముందు)**

**2020లో ఆదాయం: రూ.11వేలకోట్లు**

**2021లో ఆదాయం: రూ.12285 కోట్లు**

**2022లో ఆదాయం: రూ.35168 కోట్లు**

**రాష్ట్ర జీడీపీలో పర్యాటక రంగం: 10 శాతం**

**2019లో రాష్ట్రాన్ని సందర్శించిన పర్యాటకుల సంఖ్య: 1.83 కోట్లు**

**2019లో రాష్ట్రాన్ని సందర్శించిన విదేశీ పర్యాటకులు: 12లక్షల మంది**


**2019లో రాష్ట్ర విదేశీ మారకపు ఆదాయం: సుమారు రూ.10,000 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం 'మిషన్ 2030' ద్వారా మరింత ప్రోత్సహం అందిస్తుంది. ఈ మిషన్ ప్రకారం 2030 వరకు రాష్ట్ర జీడీపీలో టూరిజం వాటాను 12-20 శాతానికి పెంచాలని నిర్ణయించుకున్నారు.**

# క్రిమినల్ చట్టాలపై నివేదికలకు పార్లమెంటరీ స్టాండింగ్ ప్యానెల్ ఆమోదం

**- క్రిమినల్ చట్టాలపై నివేదికలకు పార్లమెంటరీ స్టాండింగ్ ప్యానెల్ ఆమోదం**

**- బిల్లుల్లో పలు మార్పులు చేయాలని సూచన**

**- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన ప్రతిపక్ష సభ్యులు**



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లను మార్చడానికి ఉద్దేశించిన మూడు బిల్లులను పరిశీలించిన హెూం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలను ఆమోదించింది. ప్యానెల్‌లోని ప్రతిపక్ష సభ్యులు భిన్నాభిప్రాయాలను సమర్పించి నప్పటికీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే బిల్లుల్లో పలు మార్పులు చేయాలని నివేదిక సూచించినట్లు తెలిసింది.కేంద్ర మాజీ హెూం మంత్రి పి. చిదంబరం సహా కొందరు సభ్యులు అసమ్మతి నోట్లు సమర్పించేందుకు మరికొంత సమయం కోరారు. వారికి బుధవారం వరకు గడువు ఇచ్చారు. చిదంబరం, టిఎంసి సభ్యులు డెరెక్ ఓ బ్రియాన్, కకోలి ఘోష్ దస్తిదార్‌లు సవివరమైన అసమ్మతి నోట్‌లను సమర్పిస్తారని ప్రతిపక్ష వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌కు చెందిన అధిర్ రంజన్ చౌదరి, దిగ్విజయ సింగ్, డీఎంకేకు చెందిన ఎన్‌ఆర్ ఎలాంగో సహా పలువురు సభ్యులు ఇప్పటికే అసమ్మతి నోట్లు సమర్పించారు. ప్యానెల్‌లోని మొత్తం 10 మంది ప్రతిపక్ష సభ్యులు వేర్వేరుగా అసమ్మతి నోట్లు సమర్పించనున్నట్లు వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగిన సమావేశంలో చిదంబరం పలు సూచనలు చేస్తూ సుదీర్ఘంగా మాట్లాడినట్లు తెలిసింది. బిల్లుల్లో హిందీని ఉపయోగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ప్రతిపక్ష సభ్యుల్లో కొందరు అభిప్రాయపడ్డారు. అయితే బిల్లులకు ఇచ్చిన హిందీ పేర్లను కమిటీ పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిని మార్చుతూ తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత, చిన్న దొంగతనం, పరువు నష్టం, ఆత్మహత్యాయత్నం వంటి కొన్ని నేరాలకు శిక్షకు ప్రత్యామ్నాయ రూపంగా సమాజ సేవను సూచించింది. కొంతమంది సభ్యులు కమిటీ సమాజ సేవను నిర్వచించాలని, అది ఊహించినదంతా చేయాలని కోరారు. అంతేకాకుండా, కొంతమంది సభ్యులు ఇప్పుడు కొత్త శిక్షా చట్టం కింద ఉగ్రవాదం, అవినీతి, వ్యవస్థీకృత నేరాలను తీసుకురావడానికి అనుకూలంగా లేరు.

# ‘24 గంటల విద్యుత్తు’ నిజమైతే మేమెవరం పోటీ చేయం

## అలంపూర్, గద్వాల, మక్తల్ సభల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్



**మహబూబ్‌నగర్ - ప్రభాతసూర్యుడు:** ‘ఉచిత విద్యుత్తు ఇవ్వాలనే అంశాన్ని కనిపెట్టిందే కాంగ్రెస్. చేవెళ్ల నుంచి ఇచ్చాపురం వరకు వైఎస్సార్ పాదయాత్ర చేసిన సమయంలో పేలుతున్న ట్రాన్స్‌పార్మర్లు, కాలుతున్న మోటార్లతో రైతులు పడుతున్న అవస్థ గమనించారు. వారికి శాశ్వత ప్రయోజనం కల్పించేందుకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని నిర్ణయించి, 2004లో అధికారంలోకి వచ్చిన మరుక్షణం అమలు చేశారు. వ్యవసాయానికి 5 గంటల కరెంటిస్తే చాలని నేను అన్నట్లుగా సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. దాన్ని నిరూపిస్తారా?” అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అలంపూర్, గద్వాల, మక్తల్ నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సంపత్‌కుమార్, సరిత, వాకిటి శ్రీహరిముదిరాజ్ తరఫున ప్రచార సభల్లో మాట్లాడారు. “బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించగలదా? ఏ సబ్‌స్టేషన్‌కైనా వెళ్దాం. లాగ్‌బుక్‌లో చూపిస్తే నేను, మా అభ్యర్థులు నామినేషన్ వేయకుండానే వెనక్కి వెళ్లిపోతాం. నేను సవాల్ చేస్తున్నా.. ఎవరొస్తారో రండి” అని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులతో కోటి ఎకరాలకు నీరిస్తున్నామని కేసీఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అలాగైతే 2014కు ముందు 18 లక్షలున్న పంపు సెట్లు ఇప్పుడు 25 లక్షలకు ఎలా పెరిగాయని నిలదీశారు. శివుడిపై ప్రమాణం చేసి కాళేశ్వరం కట్టి.. శివ లింగంతో పాటు, గుడినీ మింగినట్లు రూ.లక్ష కోట్లు కాజేశారని ఆరోపించారు. “రెండుసార్లు అ?ధికారమిస్తే రూ.లక్ష కోట్లు దోచుకున్నావ్. పదివేల ఎకరాలు కబ్జా చేశావ్. అక్రమ కేసులు పెట్టావ్. ఉద్యోగాలడిగితే లాఠీలతో కొట్టించావ్. ఇంట్లో నలుగురికి పదవులు ఇచ్చుకున్నావ్. మూడోసారి గెలిపిస్తే ప్రజలందరినీ కృష్ణాలో కలుపుతావా? నీ మనవడికి కూడా పదవిస్తావా?” అని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ గెలిస్తే ధరణిని రద్దు చేస్తారని, రైతుబంధు అందదని, దళారీ వ్యవస్థ వస్తుందని కేసీఆర్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రేవంత్ తప్పుబట్టారు. ధరణిని ఏటీఎంలాగా వాడుకునే కేసీఆర్ కుటుంబమే అతి పెద్ద దళారీ అని ధ్వజమెత్తారు. “ధరణిని తెచ్చింది 2020లో. మరి 2018లో రైతు బంధు ఎలా వేశారు? ధరణి లేకుండానే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చేశాం. వ్యవసాయ సబ్సిడీలు ఇచ్చాం. ధరణికి, రైతుబంధుకు సంబంధం లేదనే దానికి ఇదే నిదర్శనం” అని వివరించారు. ధరణి కంటే నాణ్యమైన వెబ్‌సైట్ తెస్తామని చెప్పారు. మేడిగడ్డ కుంగిపోయిందని, కేసీఆర్ పాపం పండిందని రేవంత్ అన్నారు. “ కాంగ్రెస్ ఏం చేసిందని అంటున్నారు.. జూరాల, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, భీమాతో పాటు నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, శ్రీశైలం, పోచంపాడు, సింగూరు ఇలా అన్ని ప్రాజెక్టులు కట్టింది. పాలమూరు లిఫ్టును మొదలుపెట్టిందీ మేమే. ఇందిరమ్మ ఇళ్లు కట్టింది.. హైటెక్ సిటీ కట్టింది.. ఔటర్ రింగురోడ్డు, మెట్రో రైలు కట్టిందీ కాంగ్రెస్సే. ఈ ప్రభుత్వానికి సవాల్ చేసున్నా.. ఇందిరమ్మ ఇళ్లున్న ఊళ్లల్లో ఓట్లన్నీ కాంగ్రెసకు వేయమని అడుగుదాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లున్న ఊళ్లలో ఓట్లన్నీ బీఆర్ఎసకు వేయమని కోరదాం. దీనికి కేసీఆర్ సిద్ధమా?” అని రేవంత్ సవాలు విసిరారు. 3 వేల వైన్‌షాపులు, 1800 బార్ షాపులు, 62 వేల బెల్టు షాపులు ఏర్పాటు చేశారని, పన్నెండేళ్ల పిల్లగాడి చేతిలో బీరు సీసా ఉండే దుస్థితికి తెచ్చారని దుయ్యబట్టారు. “బోయ వాల్మీకులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేకపోయాం. అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తా. బోయలను ఎస్టీలలో చేరుస్తాం. 11 శాతం జనాభా ఉన్న ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ ఒక్క సీటూ ఇవ్వలేదు. మేం 4 ఇచ్చాం. వారిని మళ్లీ బీసీ–ఎలోకి మారుస్తాం’ అని రేవంత్ హామీ ఇచ్చారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ సభలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరవడంతో కేడర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జోగుళాంబను దర్శించుకున్న అనంతరం అలంపూర్, అలంపూర్ చౌరస్తాలో రేవంత్ రోడ్డుషోలు నిర్వహించారు. శాంతినగర్‌లో సభకు హాజరయ్యారు. బీఆర్ఎస్ సభలో కేసీఆర్ చెప్పిన ప్రతి వాక్యానికి కౌంటర్ ఇచ్చి కార్యకర్తలో ఉత్సాహం నింపారు.

# ఐఆర్ఆర్ కేసులో చంద్రబాబుకు ఊరట



**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు:** రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఏపీ హైకోర్టు ఊరటను కల్పించింది. చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు విచారించింది. ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. అప్పటి వరకు చంద్రబాబును అరెస్ట్ చేయకూడదని సీఐడీని ఆదేశించింది. మరోవైపు వాదనల సందర్భంగా ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై ఉన్నారని ఆ గడువు ముగిసే వరకు ఆయనను అరెస్ట్ చేయబోమని కోర్టుకు తెలిపారు. ఆయన స్టేట్మెంట్‌ను రికార్డ్ చేసిన హైకోర్టు అరెస్ట్ చేయవద్దని ఆదేశిస్తూ తదుపరి విచారణను 22కి వాయిదా వేసింది.

# మూతపడుతున్న ఆస్పత్రులు, సేవల కేంద్రాలు



**గాజా- ప్రభాతసూర్యుడు:** ఎంతగానో అవసరమైన ఇంధన నిల్వలు తరిగిపోతుండడంతో యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజాలోని ఆరోగ్యం, పారిశుధ్యం, నీరు, ఆహార సర్వీసులు దాదాపు ‘బ్రేకింగ్ పాయింట్’ కు చేరుకుంటున్నాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఇప్పటివరకు గాజా స్ట్రిప్‌కు 569 ట్రక్కుల సాయం వచ్చింది కానీ వాటిల్లో ఏ ఒక్క దాంట్లోనూ ఇంధనం లేదని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయ ప్రతినిధి (ఒసిహెచ్ఎ) జేన్స్ లారెకె వ్యాఖ్యానించారు. ”మరిన్ని కార్యాలయాలు, సేవల కేంద్రాలు మూతపడుతున్నాయి. ప్రాణాలను కాపాడే మార్గాలు కూడా మూసు కుపోతున్నాయి.” అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి క్రిస్టినా లిండ్‌మేరర్ వ్యాఖ్యానించారు. గాజాలోకి ఇంధనాన్ని అనుమతించే విషయమై జరుగుతున్న చర్చల్లో కొంత పురోగతి వుందంటూ గత వారం ఐక్యరాజ్య సమితి ఎయిడ్ చీఫ్ మార్టిన్ గ్రిఫిత్స్ పేర్కొన్నారు. కానీ ఆ చర్చలు విఫలమైనట్లు కనిపిస్తోంది. గాజాను పూర్తిగా దిగ్బంధించాలన్న వ్యూహంలో భాగంగా ఇజ్రాయిల్ ఆ ప్రాంతంలోకి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఇంధనాన్ని ప్రవేశించకుండా దిగ్బంధించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా గాజాపై ఇజ్రాయిల్ భూ, వైమానిక, సముద్ర ఆంక్షలను అమలు చేస్తోంది. దాడులతో బందీలను విడుదల చేయలేకపోతున్నాం. గాజాలో బందీలుగా వున్న 12మందిని విడుదల చేయడానికి తాము సిద్ధంగా వున్నప్పటికీ ఇజ్రాయిల్ వైమానిక, పదాతి దాడుల కారణంగా విడుదల చేయలేకపోతున్నామంటూ హమస్ సాయుధ విభాగం ఖ్వాసమ్ బ్రిగేడ్స్ తెలిపింది. ఈ మేరకు టెలిగ్రామ్ చానెల్‌లో పోస్టు పెట్టింది. 241మందిని బందీలుగా చేపట్టారని ఇజ్రాయిల్ పేర్కొం టోంది. వారిలో ఇప్పటివరకు నలుగురిని విడుదల చేవారు. వారిలో ఇద్దరు ఇజ్రాయిలీలు కాగా మరో ఇద్దరు అమెరికన్లు. ఆయుధాలు, ఇతర మిలటరీ పరికరాలను తీసుకుని ఇజ్రాయిల్‌కు వెళ్ళడానికి వాషింగ్టన్ లోని ఒక ఓడరేవులో సిద్ధంగా వున్న నౌకను వందలా దిమంది అమెరికన్ ఆందోళన కారులు అడ్డగించారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని వారు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపిస్తాం



**ఆదిభట్ల - ప్రభాత సూర్యుడు:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్ రెడ్డి రంగారెడ్డి కి కాంగ్రెస్ అధిష్టానం నుండి మల్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చెప్పడం వల్ల మర్రి నిరంజన్ రెడ్డి ఒకటై ఇబ్రహీంపట్నం నియో జకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మల్ రెడ్డి రంగారెడ్డిని గెలిపిస్తానని మర్రి నిరంజన్ రెడ్డి వారు మాట ఇచ్చారు. తీవ్రంగా పోటీ పడగా.. అధిష్టానం మాత్రం రంగారెడ్డిని ఖరారు చేసింది. దీంతో మంగళవారం ఆదిభట్ల మున్సిపాలిటీ తన నివాసంలో విలేకరుల సమావేశంలో మర్రి నిరంజన్ ఆయన స్పందిస్తూ ‘వ్యక్తుల కంటే వ్యవస్థ ముఖ్యం. సీటు కోసం పోట ీపడటం సాధారణం. చివరకు పార్టీ అధిష్టానం తీసు కున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో చిత్తశుద్ధితో పనిచేస్తాం’ అని తెలిపారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని మాల్ రెడ్డి రంగారెడ్డి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన అని చెప్పుకుంటున్నా మంచిరెడ్డి కిషన్ రెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి అంతంత మాత్రమే అన్నారు. అరకొరగా నిధులను కేటాయించి ఒక్కొక్కటి రెండు సార్లు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడమేనా అభివృద్ధి అని బిఆర్ఎస్ పార్టీ ప్రజలలో వ్యతిరేకత కాంగ్రెస్ పార్టీలో చేరికలే నిదర్శిస్తున్నారు. తురక యంజాల్ మున్సిపాలిటీలో ఎస్సీలకు దళిత బంధు ఇస్తానని మాట తప్పారు భూమిలేని వారికి మూడు ఎకరాల భూమి ఇస్తానని ఇవ్వలేదు. పేదవాళ్లకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తానని ఇంతవరకు ఇవ్వలేదు. కాబట్టి బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగిరేసామని ఎమ్మెల్యే అభ్యర్థి మల్రెడ్డి రంగారెడ్డి తెలియజేశారు. ఆ గ్యారెంటీ పథకాల్లో తెలంగాణ సంక్షేమ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని. అందుకే ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఆశీర్వదించి చేయి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాడు రూ.400 ఉన్న వంట గ్యాస్ సిలిండర్.. నేడురూ.1200కు చేరిందని, దీంతో పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సిలిండర్ను రూ.500కు సరఫరా చేసేందుకు సిద్ధంగా అలాగే మహిళలు ఒక రూపాయి కూడా చెల్లించకుండా బస్సులో ప్రయాణించే అవకాశం కల్పిస్తుందని ప్రతి నెల రూ.2500 ఆర్థిక సాయం అందజేస్తుందని గతంలో 200 ఉన్న పింఛన్లు క్రమంగా రూ.4 వేలు పెంచిందని దానిని రూ.5 వేలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పింఛన్లు తప్ప బిఆర్ఎస్ కొత్తగా ఇచ్చిన పింఛన్లు ఏమీ లేవని అన్నారు. 200 యూనిట్స్ వరకు ఉచిత కరెంటు అందజేస్తామని ఇల్లు లేని నిరుపేదలకు ఇంద్రమ్మ ఇండ్లు కట్టించి తీరుతామని చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజ కవర్గంలో అనేక గ్రామాలు అభివృద్ధికి నోచుకోక సమస్యలతో అల్లుతున్నాయని. తెలంగాణ ప్రభుత్వం లో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని వారు కాంగ్రెస్ పార్టీని గెలిపించండి చేయి గుర్తుకే మీ ఓటు వేయాలని ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి చిలుక మధుసూదన్ రెడ్డి , లక్ష్మీపతి గౌడ్ , ఈసీ శేఖర్ గౌడ్ , భూపతి గల మహిపాల్ కొత్త కురుమ శివ ,మంగమ్మ ,కొంగర విష్ణువర్ధన్ రెడ్డి , గజ్జి రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రలోభాల నాయకులు ఎన్నికల తరువాత కనిపించరు

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు :** బోంగ్లూర్ లో జరిగిన నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమావేశమై, ప్రసంగించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలయిపోగానే ప్రజలను మరిచిపోవడం కాంగ్రెస్ నైజమని. 55 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇంటి ముందు అభివృద్ధి, కంటిముందు సంక్షేమం. మేలు చేసే కేసీఆర్ వెంటే తెలంగాణ ప్రజలు టికెట్ల కోసం ఢిల్లీకి పరిగెత్తే నాయకులు ప్రజలకేం చేయగలుగుతారు.తెలంగాణ ఆత్మగౌరవ పతాక మన గులాబీ జెండా మంచి చేసింది మనమే ప్రజలు గెలిపించేది మనల్నే, కారు గుర్తుకే తెలంగాణ ప్రజలు అండ. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు, సర్పంచులు ఎంపీటీసీలు జడ్పీటీసీలు పార్టీ శ్రేణులు నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అందరి సంక్షేమం



**మంచాల- ప్రభాత సూర్యుడు:** మంగళవారం ఆగాపల్లి గ్రామంలో సోనియా గాంధీ ప్రకటించినటువంటి ఆరు గ్యారెంటీ కార్డులను ప్రజలకు ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచాల మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల రాజు పాల్గొన్నారు . ఆయన మాట్లాడుతూ హస్తం గుర్తుకు ఓటేసి మల్ రెడ్డి రంగారెడ్డి ని గెలిపిస్తే 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు 2500 రూపాయలు ప్రతినెల ఇవ్వడం జరుగుతుంది. వృద్ధులకు నాలుగు వేల రూపాయల పెన్షన్ గృహ జ్యోతి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ మహిళలందరికీ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం రైతులకు పెట్టుబడి సాయంగా సంవత్సరానికి 15000 రూపాయలు కౌలు రైతులకు బి ఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ప్రజలకు హామీలు ఇవ్వడం తప్ప ఆచరణలో సాధ్యం కాలేదు తెలంగాణ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే కల్వకుంట్ల కుటుంబం రాజ భోగాలు అనుభవిస్తుంది ఈ యొక్క బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దతించాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మల్ రెడ్డి రంగారెడ్డి నీ అసెంబ్లీకి పంపించేంతవరకు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని చెప్పి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆగపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సావత్ రాజు ,గ్రామ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంగూరి శ్రీశైలం, ఉపాధ్యక్షులు పల్లె అనిల్ ,యూత్ కాంగ్రెస్ నాయకులు కమ్మలపల్లి రాజేష్ బూడిద కృష్ణ, కంబాలపల్లి జంగయ్య, పల్లె నరేష్ ,బచ్చలకూర మహేష్ ,బచ్చలకూర నాని ,బచ్చలకూర సాయి, బచ్చలకూర వినిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215